ప్రజాశక్తి
ఆదివారం 25 జూన్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



ఖాళీ కంచాలతో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ఎనిమిది వారాలుగా
వేతనాలు ఇవ్వకుంటే ఎలా?

- 'ఉపాధి' కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలి
- వ్య.కా.స జిల్లా కార్యదర్శి కంకణాల డిమాండ్
- భిక్షాటన చేస్తూ కూలీల నిరసన
- ప్రజాసంఘాల సంఘీభావం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత ఎనిమిది వారాలుగా ఉపాధి హామీ కూలీలు చేసిన పనికి ఇవ్వాల్సిన వేతనాల జాప్యంతో వారు భిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. ఉపాధి కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత ఉపాధి కూలీలు ఖాళీ కంచాలు పట్టుకుని రోడ్ల వెంట భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం జరిగిన ధర్నాలో కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులేవీ లేవని, జిల్లా అంతటా ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో సుమారు రూ.100 కోట్లు పైగా ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ ▶ 2లో

దివాకరపురాన్ని
మళ్లీ చుట్టుముట్టిన కిడ్నీ వ్యాధి

- గత్యంతరం లేక విష రసాయనాల నీటినే తాగుతున్న గ్రామస్తులు
- ఆర్వో ప్లాంట్ ఉన్నా నిరుపయోగంగా ఉన్న వైనం
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని దివాకరపురంను కిడ్నీ వ్యాధి మళ్లీ చుట్టుముడుతోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో విషరసాయనాలున్న నీటినే అక్కడి ప్రజలు తాగుతున్నారు. ఆర్వోప్లాంట్ ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు పట్టించుకోక నిరుపయోగంగా ఉంది. గ్రామం మొత్తం మీద 80 కుటుంబాలుండగా సుమారు 300 మంది ప్రజలున్నారు. వీరిలో ముగ్గురు ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఒకరు ఈ మధ్యనే చనిపోయారు. మరో పది మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రజలు ఇంత ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పాలకులెవరూ పట్టించుకోవడం లేదు.



డయాలసిస్ చేయించుకుంటున్న వ్యక్తులు

గతంలో ప్రజాశక్తిలో 'ఊరి పేరు సూర్యుడు.. ఊరంతా చీకట్లు' అనే శీర్షికతో మెయిన్ పేజీలో కథనం ప్రచురితమైంది. అప్పట్లో యుటిఎఫ్, జెవివి చొరవ చూపి ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. అప్పటి శాసనమండలి ప్రొటెం స్పీకర్, అప్పటి జెవివి నాయకులు విఠపు బాలసుబ్రమణ్యం చొరవ చూపి గ్రామంలోని బోరు నీటిని, గ్రామస్తులు వాడుకుంటున్న నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఆ నీటిలో విష రసాయనాలున్నాయని నివేదికలు వచ్చాయి. విఠపు బాలసుబ్రమణ్యం చొరవ చూపి నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి ద్వారా దివాకరపురంలో నిమ్స్ వైద్య బృందంతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆ తరువాత డాక్టర్ రాజారెడ్డి గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలోని నీరు విషతుల్యమని, దానికి పరిష్కార మార్గం సాగర్ నీరేనని, ప్రతి ఒక్కరూ సాగర్ నీరు తాగాలని సూచించారు. వీలున్న మేరకు గ్రామంలో పండించే కూరగాయలు, వరి పంటలకు కూడా గ్రామంలోని నీరు వాడొద్దన్నారు. సాగర్ నీరు వాడాలని సూచించారు. పాల వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అప్పట్లో ▶ 2లో



మూతపడిన ఆర్వో ప్లాంట్



వివరాలు తెలుసుకుంటున్న ప్రవీణ్ ప్రకాష్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

▶ 4లో



మాట్లాడుతున్న రావుల వెంకయ్య

విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిఘటించండి

▶ 8లో



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

అమర్నాథ్ కుటుంబానికి
న్యాయం చేయాలి

- హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి
- బాపట్లలో భారీ ర్యాలీ..

ప్రజాశక్తి-బాపట్ల

అమర్నాథ్ కుటుంబానికి న్యాయం చేయాలని, అమర్నాథ్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతి రెడ్డి శ్రీనివాసకుమారి డిమాండ్ చేశారు. శనివారం అమర్నాథ్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో సిపిఎం పర్యవేక్షణలో కాంగ్రెస్, విసికె పార్టీలతోపాటు బీసీ, దళిత, ప్రజాసంఘాల మద్దతుతో బాపట్ల వ్యవసాయ కళాశాల నుండి పాత బస్టాండ్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్లో శ్రీనివాసకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ▶ 2లో

వేతనాలు ఇవ్వకుంటే ఎలా?

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. 45 డిగ్రీల పైగా ఉష్ణోగ్రత ఉన్న ఎండల్లో సైతం గతిలేక కూలిలు సుదూర ప్రాంతాలకు వెళ్లి పని చేసి వస్తుంటే, చేసిన పనికి కూడా వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ పాలకుల విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభంలో కోరుకుపోయిందని, ఇటువంటి స్థితిలో గ్రామీణ పేదల కొనుగోలు శక్తిని పెంచటం కోసం ఉపాధి హామీకి నిధులు పెంచటమే ఏకైక మార్గమన్నారు. ఏడాదికి రెండు లక్షల 60 వేల కోట్లు ఉపాధికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాలని కోరుతుంటే కేవలం 60 వేల కోట్లకు కుదించటం అమానుషమన్నారు. ఫలితంగా వేతన బకాయిలు పెరుగుతున్నాయని, కూలీలు ఉపాధికి దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ రక్షణ కోసం మరొక మహత్తర ఉద్యమం సాగించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

ధర్నాకు ప్రజాసంఘాల సంఘీభావం

ధర్నాకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురాం, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు సంఘీభావం తెలిపారు. ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెజి మస్తాన్, ఊసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, బడుగు వెంకటేశ్వర్లు, గుమ్మా బాలనాగయ్య, ఉబ్బా వెంకటేశ్వర్లు, అంగలకుర్తి బ్రహ్మయ్య, పట్టపు ప్రకాశం, పారాబత్తెన శ్రీనివాసరావు, వై వీరనారాయణ, జి భాగ్యమ్మ, కె.అనంతలక్ష్మి, మల్లెల సంపూర్ణ, అన్నవరపు శేషయ్య, వి మోజస్, బి జనార్ధన్, బొంత భాస్కరరావు, బొడ్డు కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో పేస్ కళాశాల క్యాడెట్ల ప్రతిభ

ప్రజాశక్తి-టంగుటూరు

ఎన్‌సీసీ శిబిరంలో స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాల క్యాడెట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అన్నారు. శనివారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఎన్‌సిసి ఏటీసీ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. శిబిరంలో ఎన్‌సిసి క్యాడెట్లు వివిధ విభాగాలలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. శిక్షణలో ఫైరింగ్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, హెల్త్ హైజీన్, నృత్య ప్రదర్శన తదితర విభాగాలలో పేస్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు 12 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ చంద్రశేఖర్, 34ఎ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్ కొటిన్వోల్ల చేతుల మీదుగా అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్‌తో పాటు ప్రిన్సిపల్ జీవీకే మూర్తి, స్టూడెంట్స్ డీన్ ఆర్ వీరాంజనేయులు, కళాశాల ఏఓ ఎం రమణబాబు, డిప్లొమా ప్రిన్సిపాల్ జి కోటిరెడ్డి, ఎన్‌సీసీ ఏఎన్ఓ ఏ పృథ్వీ కృష్ణ, కళాశాల పీడీ ఐ మధుసూదన్ పాల్గొన్నారు.

దివాకరపురాన్ని మళ్లీ చుట్టుముట్టిన కిడ్నీ వ్యాధి

(మొదటిపేజీ తరువాయి)

జెవివి, యుటిఎఫ్ కృషి ద్వారా గ్రామానికి సాగర్ నీటిని ఏర్పాటు చేశారు. దీంతో కొంతకాలం పాటు పైపుల్ ద్వారా గ్రామానికి సాగర్ నీరు సరఫరా చేశారు. అప్పట్లో వ్యాధి బారిన పడిన వారికి కొంత ఉపశమనం కలిగింది. సాగర్ నీరు తాగినంత కాలం కొత్తగా ఎవ్వరూ కిడ్నీ, క్యాన్సర్ లాంటి వ్యాధులకు గురి కాలేదు. ఆ తరువాత సాగర్ నీరు సరఫరా అయ్యే పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో గ్రామానికి వచ్చే సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. శీలం సుదర్శనం సర్పంచిగా ఉన్న సమయంలో ఎంపీ నిధులతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి.. కొంత పంచాయతీ నిధులు కలిపి కొంతకాలం పాటు ఆర్వో ప్లాంట్‌ను నిర్వహించారు. గత రెండు సంవత్సరాలుగా ఆర్వో ప్లాంట్ మూతపడింది. ఈ మధ్యకాలంలో పొరుగు గ్రామాల నుండి వచ్చే ట్యాంక్ నీరు కొని తాగినప్పటికీ కిడ్నీ వ్యాధులు గతంలో మాదిరిగానే ప్రబలుతున్నాయి. ప్రస్తుతం చల్లా వెంకటేశ్వర్లు, వజ్రాల చిన్నయ్య, వేమూరి నరసింహం డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ మధ్యనే కిడ్నీ వ్యాధితో అద్దంకి మాలకొండయ్య చనిపోయారు. ప్రస్తుతం కాకర్ల మాలకొండయ్య, కోటపాటి లక్ష్మమ్మ, పోలినేని వెంకటలక్ష్మమ్మ, చీమలదిన్నె అంకయ్య, పోలినేని మాలకొండయ్య, నూకతోటి చెన్నయ్య, చీమలదిన్నె పెద్దఅంకయ్య, చీకల చిన్ననాగయ్య, పోలినేని సుబ్బయ్య, నీలం ప్రభుదాస్, నీలం రమణయ్య, పల్లె రత్తమ్మ, అద్దంకి మరియమ్మ, అద్దంకి చిన్నమాలకొండయ్య, గోయిపాతుల దానమ్మలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్నారు. ఈ విధంగా గ్రామంలో తాగునీటి సౌకర్యం లేకపోవడం, ఇతర ప్రాంతాల నుండి వచ్చే నీరు తాగడం మూలంగా కిడ్నీ వ్యాధులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివాకరపురంలో 2007లో కొత్తగా కాలనీలు ఏర్పాటైన తరువాత ఇప్పటివరకు 42 మంది కిడ్నీవ్యాధితో చనిపోయారు. మొదట నీలం ఏసయ్య కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. చిన్నవయస్సులో పెళ్లి కాని వారు కూడా కిడ్నీ వ్యాధికి గురయ్యారు. అనారోగ్యం సోకితే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నా భయపడుతున్నారు. మందులు కూడా వేలాది రూపాయలు వెచ్చించి వాడుతున్నాప్పటికీ తాగునీటి సౌకర్యం, పౌష్టికాహారం లేక కిడ్నీ వ్యాధి నయం కావడం లేదు. ఈ వ్యాధితో పాటు మరో పది మంది రకరకాల వ్యాధులతో బాధపడుతున్నారు. కానీ ఆ గ్రామం వైపు అధికార పార్టీ నేతలతో పాటు ప్రతిపక్ష నేతలు కూడా కన్నెత్తి చూడడం లేదు. నిరుపయోగంగా పడి ఉన్న ఆర్వోప్లాంట్‌ను తెరిపించి నీటిని సరఫరా చేసేందుకు చొరవ చూపడం లేదు. అందువల్ల లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ పిచ్చిమొక్కలు, చిల్లచెట్లతో నిరుపయోగంగా ఉంది.

మూడేళ్ల నుంచి డయాలసిస్ చేయిస్తున్నా..

చల్లా వెంకటేశ్వర్లు

నాకు వివాహం కాలేదు.నాకు మూడు సంవత్సరాల క్రితం కిడ్నీ వ్యాధి బయటపడింది. అప్పటి నుండి డయాలసిస్ చేయించుకుంటున్నాను. నెలకు రూ.15 వేల వరకు ఖర్చవుతోంది. తాను గతంలో ఇటుకల బట్టీ వద్ద పనికి వెళ్లేవాడిని.. గ్రామానికి సాగర్ నీటిని సరఫరా చేసి గ్రామంలోని ఆర్వోప్లాంట్‌ను తెరిపిస్తే.. కొంతమేరకు ఉపశమనం కలుగుతుంది.

108 గ్రామంలోకి రావడం లేదు..

వజ్రాల చిన్నయ్య

నాకు 12 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ రెండు సంవత్సరాల నుండి డయాలసిస్ చేయించుకుంటున్నా.. నెలకు రూ.14వేల వరకు ఖర్చవుతోంది. కొన్ని మందులు పడకపోవడం వల్ల శరీరం అంతా తెల్లగా మారి బొల్లివ్యాధిలా వచ్చింది. 108 వాహనం వారు గ్రామంలోనికి రాకుండా మెయిన్ రోడ్డులో ఉండి అక్కడకు నడిచి రావాలంటున్నారు. 108 వాహనం వద్దకు వెళ్ళాలంటే కనీసం నాలుగు సార్లు రోడ్డు మీద కూర్చొని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ వాహనం గ్రామంలోనికి వస్తే సౌకర్యంగా ఉంటుంది. కనిగిరిలో ఉన్న డయాలసిస్ సెంటర్‌లో కూడా మాకు సక్రమంగా వైద్యం అందడం లేదు. విద్యుత్ కోత, తదితర సమస్యలతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చయింది..

వేమూరి నరసింహం

నాకు గత 12 సంవత్సరాల నుండి ఆరోగ్యం బాగాలేదు. రెండు నెలల నుండి డయాలసిస్ చేయించుకుంటున్నాను. కిడ్నీ మరియు షుగర్ వ్యాధి ఉండడంతో కరోనా సమయంలో కరోనా సోకి రూ.13 లక్షల మేరకు ఖర్చు అయ్యింది. ఆ తరువాత రక్తంలో ఇన్ఫెక్షన్ వచ్చి రూ.1.50 లక్షలు ఖర్చు అయ్యాయి. దీనికి తోడు టిబి సోకడంతో మరో ఒక లక్ష ఖర్చయ్యింది. క్షయవాధి మందుల వలన కళ్లు కనిపించకుండా పోవడంతో మరో రూ.1.50వేలు ఖర్చు చేసి ఎల్‌వి.ప్రసాద్ వైద్యశాలలో వైద్యం చేయించుకున్నాను.

అమర్నాథ్ కుటుంబానికి న్యాయం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ప్రధానంగా మహిళలపై దాడులను నియంత్రించడంలో జగన్ ముందుంటారని చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమై ఆచరణ సాధ్యం కాకపోవడం వల్లే అమర్నాథ్ హత్యకు దారి తీసిన పరిస్థితులు దాపురించాయన్నారు. రాష్ట్ర మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ఈ హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ చేస్తామని చెప్పిన మాటలు ఇంతవరకు అమలు జరగలేదన్నారు. అమర్నాథ్ హత్య నేపథ్యం రెండు కుటుంబాల మధ్య తగాదా అని చెబుతున్న బాపట్ల జిల్లా పోలీసులు, ఎస్పీ వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. తన సోదరిని వేధించవద్దని ప్రతిఘటిస్తే తట్టుకోలేక అత్యంత దారుణంగా పక్కా ప్రణాళిక ప్రకారం పెట్రోలు పోసి కాల్చి.. హత్య చేస్తే,ఎవరికి తెలియకుండా ఉప్పాలవారిపాలెం గ్రామ పెద్దల సహకారంతో అమర్నాథ్‌ది ఆత్మహత్యగా చిత్రీకరించాలని చూశారన్నారు. చివరిక్షణంలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ.. తన అక్కని వేధించొద్దని అన్నందుకే తనపై పెట్రోల్ పోసి.. నిప్పంటించారని అమర్నాథ్ మరణ వాంగ్మూలం ఇస్తే.. ఇది రెండు కుటుంబాల తగాదా అని బాపట్ల ఎస్పీ, అధికారపార్టీ ప్రజాప్రతినిధులు వ్యాఖ్యలు చేయటం వెనుక కుట్రకోణం దాగి ఉందన్నారు. హత్య చేసిన నిందితులకు శిక్ష ఖరారు చేయడం ఆలస్యమైతే, నిందితులు బెయిలుపై బయటతిరిగితే అమర్నాథ్ కుటుంబానికి రక్షణ కరువవుతుందన్నారు. అమర్నాథ్ కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేవరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ అమర్నాథ్ హత్య విషయంలో ప్రభుత్వం మాట మార్చకుండా సత్వర అన్యాయం జరిగే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మనోజ్ కుమార్, బి.ఆర్య మాట్లాడుతూ విద్యార్థి అమర్నాథ్ హత్య లాంటి ఘటన రాష్ట్రంలో తిరిగి జరగకుండా విద్యార్థులకి, మహిళలకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జె విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవికుమార్, రేణుక, బీసీ సంఘం నాయకులు భాస్కర్ గౌడ్, మాల మహానాడు నాయకులు రోజన్ బాబు, ప్రజా సంఘాల నాయకులు టి కృష్ణమోహన్, సిహెచ్ మజుందార్, శరత్, చంద్రశేఖర్, నూతలపాటి కోటేశ్వరావు, వై భాస్కరరావు, జేవివీ నాయకులు కోటా వెంకటేశ్వర రెడ్డి, శేఖర్, శామ్యూల్, సుభాషిని, భాను, రవి, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఐదు కోట్ల మంది

భవితను ఛిద్రం చేసిన జగన్

వెలిగండ్లకు చేరిన చైతన్య రథయాత్ర

ప్రజాశక్తి-వెలిగండ్ల

రాష్ట్రంలో ఐదు కోట్ల ప్రజల జీవితాలను ఛిద్రం చేసిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని టిడిపి ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు నూకసాని బాలాజీ విమర్శించారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో కనిగిరి నియోజకవర్గం వెలిగండ్ల మండలంలో చైతన్య రథయాత్ర శనివారం మధ్యాహ్నం వెలిగండ్లకు ప్రవేశించింది. తొలుత హుస్సేన్‌పురం గ్రామం వద్ద మహిళలు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులకు తిలకం దిద్ది స్వాగతం పలికారు. అనంతరం వెలిగండ్లలోని అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. తిరుపతి పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు నర్సింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దోచుకో-దాచుకో అన్న రీతిలో పాలన సాగుతోందని, ఇసుక, మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణా వైసిపి నాయకుల కనుసన్నల్లో సాగుతోందని విమర్శించారు. హామీలు ఇచ్చి అమలు చేయని అసమర్థ ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. కొండపి ఎమ్మెల్యే డోల బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అగ్గిపెట్టె కాడనుంచి ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల బతుకులను నాశనం చేశాడని, ఒక్క ఛాన్స్ అంటూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి, పరిశ్రమలు లేక యువత భవిష్యత్తు గ్యారెంటీ లేకుండా పోయిందని విమర్శించారు. కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తుకు గ్యారంటీ లేకుండా చేసిన ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అని చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రతి ఒక్క కార్యకర్త గ్రామాల్లో తిరిగి ఈ మ్యానుఫేర్టు గురించి చెప్పి తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసి కనిగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగరవేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ చైతన్య రథయాత్రకు బయలుదేరినప్పటి నుంచి ప్రతి గ్రామంలో అపూర్వ స్వాగతం పలుకుతున్న కార్యకర్తలకు నేను రుణపడి ఉన్నానని అని అన్నారు. ప్రతి పల్లెలో ఈ విధంగా చైతన్య రథయాత్రలో తిరిగి ప్రజలను కలుసుకోవాలని ఆసక్తి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కార్యదర్శి గోన ప్రతాప్, రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, గవదగట్ల పెదమాల కొండయ్య, కర్నాటి భాస్కర్‌రెడ్డి, మీనిగా కాశయ్య, మొటాటి సుబ్బారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ షరీఫ్, గవదగట్ల హరి, కొండు భాస్కరరెడ్డి, సందడి మస్తాన్‌రెడ్డి, గవదగట్లహరి, కారంపూడి వెంకటేశ్వర్లు, గంజి రాశేఖర్‌రెడ్డి, కేలం చంద్ర, శోభిరాల వేణుగోపాల్, సోమిశెట్టి సుబ్బారావు, బైసాని సుబ్రహ్మణ్యం, బొప్పారాజు లక్ష్మీ నారాయణ, కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-పర్చూరు

కొనికి గ్రామానికి చెందిన గట్టు విజయదుర్గ(73) అనే వృద్ధురాలు ఇంకొల్లు బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో పర్చూరు ఆర్టీసీ బస్టాండ్ బయట పర్చూరు బస్‌స్టాండ్ నుంచి బాపట్ల వైపు వెళ్లు ఏపీఎస్‌ఆర్‌టీసీ నడుపుచున్న బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా బస్సును నడిపి రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఢీ కొట్టాడు. బస్సు కొంచెం ముందుకు వెళ్లినట్లు, ఆ వృద్ధురాలు బస్సు టైర్‌ల కింద పడి, అక్కడికక్కడే మృతిచెందినట్లు, మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్చూరు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి నేర స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం పర్చూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు పంపారు. నిర్లక్ష్యంగా బస్సును నడిపిన ఆర్‌టీసి బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండల సత్యవతి పేట వద్ద అక్రమ మద్యం అమ్ముతున్నారని సమాచారం రావడంతో బాపట్ల సెబ్ సిఐ శ్రీనివాసులు శనివారం తెల్లవారు జామున అక్రమ మద్యం అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్లపాలెం సత్యవతి పేటకు చెంది న కప్పల నారాయణరెడ్డి, పిట్టలవాని పాలెం మండల కొత్తపాలేనికి చెందిన మారుబోయిన వెంకటేశ్వర రెడ్డిలు అక్రమ మద్యం అమ్ముతుండగా వారి వద్ద నుంచి 750 మిల్లీ లీటర్ల 227 ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

పిట్టలవానిపాలెం మండలం కోమలి గ్రామానికి చెందిన శ్యామల సంధ్య(25) అనే వివాహిత తన భర్తతో జరిగిన గొడవల కారణంగా సుమారు వారం రోజుల క్రితం ఇంటిలో ఉన్న పురుగుల మందును తాగింది. ఆమెను గుంటూరుకు తరలించగా అక్కడ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున చనిపోయినట్లు సమాచారం. దీనిపై ఛందోలు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొదిలి

రైతులందరూ విధిగా పంట నమోదు చేయించుకుని ప్రభుత్వ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని మార్కాపురం శాసన సభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 3వ రైతు భరోసా కేంద్రంలో కంది, కొర్ర విత్తనాల చిరు ధాన్యాల సంచులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రం పరిధిలో కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద ప్రభుత్వం ఇచ్చిన వస్తువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ వస్తువులను రైతులందరూ అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవాలన్నారు. కౌలుకు సాగు చేసుకునే రైతులందరూ తప్పనిసరిగా పంట ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ మాట్లాడుతూ రైతులందరికీ కంది మినీ కిట్స్ ఉచితంగా ఇస్తారని అన్నారు. దీనికి గాను ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్ చేయించుకొని విత్తనాలను తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో ఎరువులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతామని అన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎస్‌కె జైనులాబ్దిన్ మాట్లాడుతూ కొర్ర విత్తనాలను కూడా రైతులకు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆహార సలహా సంఘం సభ్యులు కొండ్రగుంట సుబ్బారావు, మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, మాదాలవారిపాలెం పిఎసిఎస్ అధ్యక్షులు కొత్తపులి బ్రహ్మారెడ్డి, వైసిపి నాయకులు సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దుగ్గెంపూడి బ్రహ్మారెడ్డి, పేరం చెంచిరెడ్డి, అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులు, సర్పంచులు, మండల వైసీపీ నాయకులు, మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

అభి షాపింగ్ మాల్ దగ్ధం

రూ.3 కోట్లకు పైగా ఆస్తినష్టం

ప్రకాశం-దరిశి

దరిశిలో మేడా హనుమంతరావుకు చెందిన అభి షాపింగ్ మాల్ (బట్టలషాపు)లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తెల్లవారుజామున 4 గంటలకు పెద్దమంటలు చెలరేగాయి. దరిశి, అద్దంకి నుంచి ఫైర్‌ఇంజన్లు వచ్చి మధ్యాహ్నం వరకు మంటలు అదుపు చేశాయి. దాదాపు బట్టలషాపులో రూ.1,40,00,000 విలువగల బట్టలు, 10 లక్షల నగదు, రూ.80 లక్షల విలువైన ఫర్నీచర్ కాలిపోయింది. దాదాపు రూ.3 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. కోటిన్నర విలువ గల భవనం కూడా దెబ్బతిన్నట్లు మేడా హనుమంతరావు తెలిపారు. షాపునకు ఎలాంటి ఇన్సూరెన్స్ లేదని తనకు రూపాయి వచ్చేదిలేదని వాపోయారు. ఈ విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి దరిశి మాజీ ఎమ్మెల్యే డాక్టరు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వచ్చి పరిశీలించి మేడా హనుమంతరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.


దగ్ధమవుతున్న షాపు


దగ్ధమైన బట్టల షాపును పరిశీలించి యజమానితో మాట్లాడుతున్న బూచేపల్లి

కుష్టువ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండల కేంద్రమైన జరుగుమల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని అవగాహనా ర్యాలీ శనివారం జరిపారు. ఆ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ సరస్వతి మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చర్మం బత్తాయి తొక్క లాగా వుండటం, చెవులపై, వీపుపై నొప్పిలేని బుడిపెలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవటం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవటం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేక పోవటం, చేతుల నుంచి వస్తువులు జారిపోవటం, కాళ్ల చెప్పులు జారిపోవటం లాంటి లక్షణాలు ఉన్న ఎడల జరుగుమల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షించుకోవాలని సూచించారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులు ఇవ్వనున్నామని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి వెంకటేశ్వరరావు, కె తిరుపతమ్మ, కె చంద్రశేఖర్, ఆశాలు, వాలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


జరుగుమల్లిలో కుష్టు వ్యాధిపై ర్యాలీ చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

ఉద్యాన పంటల రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉద్యాన పంటలను రక్షించుటకు నీటి సరఫరా ఖర్చులను ప్రభుత్వమే భరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవండ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలో తీవ్ర వర్షాభావం వల్ల నీటి సమస్య తీవ్రతరమైందని, ఈ ప్రాంతంలో దాదాపు వెయ్యి అడుగులకు పైగా బోర్ వేస్తే గాని నీరు వచ్చే పరిస్థితి లేదని అన్నారు. ప్రతి గ్రామానికి ట్యాంకర్ ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని అన్నారు. ఈ ప్రాంతంలో అకాల వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న బొప్పాయి, బత్తాయి, అరటి తదితర పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేనిఎడల ఈ ప్రాంత రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెవి కృష్ణగౌడ్, గురునాథం, మన్నే సాంబశివరావు, బాణాల రామయ్య, నక్కా తిరుపతయ్య, విశ్వరూపాచారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం



బోర్డును పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

దరిశిలో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-దరిశి

నో యాక్సిడెంట్ డే సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడపరాదని దరిశిలో అక్కడక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మల్లికాగార్గ్ ఆదేశాల మేరకు సిఐ జె రామకోటయ్య పర్యవేక్షణలో బార్ & రెస్టారెంట్స్ వద్ద ఒక క్షణం ఆలోచించండి అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. యాక్సిడెంట్ జరిగితే కలిగే పరిణామాలను హెచ్చరిక బోర్డులో వివరించారు.



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నరేంద్ర కుమార్

జెవికె కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-అమృతలూరు

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నాడు జగనన్న విద్యా కానుక కిట్లు ఎంపీపీ రాపర్ల నరేంద్ర కుమార్, మండల విద్యాశాఖ అధికారి చీకటి రవికాంత్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక పేద విద్యార్థులకు ఒక వరం లాంటిదని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పుస్తకాలు, బ్యాగులు, బూట్లు తదితర వస్తువులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరీక్షణరావు, మండల విద్యాశాఖ అధికారి చీకటి రవికాంత్, అమృతలూరు సర్పంచ్ రాము, చైర్మన్ వెంకయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న తహశీల్దారు కవిత

జగనన్న సురక్ష పథకం ప్రజలకు వరం

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

మండలంలోని ఖాజీపాలెం గ్రామ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వాలంటీర్ల ద్వారా ప్రతి గడపకూ వెళ్లి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కుంభం అనూష ప్రసన్నరాజు, మండల తాహశీల్దారు కవిత పరిశీలించారు. అలాగే సురక్ష పథకం ద్వారా అందించే సేవలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాంతకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

ధర్నాను జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అద్దంకి

ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అద్దంకి ఎంపీడీవో ఆఫీస్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని చక్రాయపాలెం ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు గత ఆరువారాల నుంచి చెల్లించడం లేదని, ఈ కారణంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. క్రమంగా కూలీలు ఈ పని మానుకొని వేరే ప్రాంతాలకు వలస పోతున్నారని అన్నారు. వలసలు నివారించడం కోసం ఏర్పాటు చేసిన ఈ ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయటం లేదని, అందుకనే సోమవారం జరిగే ధర్నాలో ఉపాధి కూలీలందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అద్దంకి మండల కార్యదర్శి మొండ్రు చిన్న సుబ్బారావు, కూలీలు పాల్గొన్నారు.

సాహితీ క్షేత్రంలో అక్షర హాలికుడు గోలి లక్ష్మయ్య

బివికెఎస్ ట్రస్ట్ అధినేత డాక్టర్ శరత్ బోస్

ప్రజాశక్తి-బాపట్ల

సాహితీ క్షేత్రంలో అక్షరాల పంటలు పండించే హాలికుడిగా బాపట్ల జిల్లా డిసిఆర్‌బి డిఎస్‌పి గోలి లక్ష్మయ్య అక్షర సేవలు అనిర్వచనీయమని బివిఎస్‌కే ట్రస్ట్ అధినేత డాక్టర్ శరత్ బోస్ అన్నారు. శుక్రవారం రాత్రి బాపట్లలో డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న గోలి లక్ష్మయ్య పదోన్నతిపై గుంటూరుకు బదిలీ అయిన సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో బాపట్ల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో లక్ష్మయ్యకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌బోస్ మాట్లాడుతూ ప్రచార ప్రసార మాధ్యమాల తాకిడికి పుస్తక పఠనానికి దూరమవుతున్న విద్యార్థులు, ప్రజలకు పుస్తక ఉద్యమం ద్వారా పుస్తకాలకు చేరువ చేయాలనే లక్ష్యానికి శ్రీకారం చుట్టి సాహితీ కళా రంగాలకు గోలి లక్ష్మయ్య అందిస్తున్న సేవలు అపారమైనవ న్నారు. కళామతల్లి ముద్దుబిడ్డగా, సాహితీ సౌజన్య మూర్తిగా తెలుగు రాష్ట్రాల్లో విశేష ఖ్యాతి గడించారన్నారు. వృత్తి రీత్యా పోలీసుశాఖలో ఉద్యోగమైనప్పటికీ ప్రవృత్తి సాహిత్య రంగానికి ఆయన వెలకట్టలేని సేవలు అందించారు. విద్యార్థుల చేత పుస్తకాలు చదివించాలనే లక్ష్యంతో పుస్తకోద్యమానికి శ్రీకారం చుట్టి భావపురి పుస్తకోద్యమ సమితిని స్థాపించారు. బదిలీపై వెళ్తున్న డిఎస్‌పి గోలి లక్ష్మయ్య దంపతులను పలు సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు కలిమిశ్రీ, అయినాల మల్లేశ్వరరావు, పావులూరి శ్రీనివాసరావు, వెంపటి సత్యన్నారాయణ, మన్నే శ్రీనివాసరావు, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి, పుస్తక ఉద్యమ సమితి అధ్యక్షులు పిసి సాయిబాబు, చిత్రకారుడు జీవి, గ్రంథాలయాధికారి శివాజీ గణేశన్, మల్లికార్జున, మానం అప్పారావు, వంకాయలపాటి హరిబాబు, ప్రజా వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, ఎఎం వరప్రసాద్ పాల్గొన్నారు.



గోలి లక్ష్మయ్య దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు



నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎంఈఓ నాగేశ్వరరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండల విద్యాశాఖాధికారిగా పనిచేసి బదిలీపై తాడేపల్లి వెళ్లిన దామా నాగేశ్వరరావుకు ఉపాధ్యాయులు వీడ్కోలు పలికారు. శాలువాలు, పూలదండలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు అధ్యక్షత వహించిన వైఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఈదర రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలలను నాగేశ్వరరావు గొప్పగా అభివృద్ధి చేశారని కొనియాడారు. కరోనా సమయంలో కూడా ఉపాధ్యాయులకు చేదోడు వాదోడుగా నిలిచారని తెలిపారు. ఉపాధ్యాయులందరి మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి నాగేశ్వరరావు అని కారంచేడు ఎమ్ఈఓ మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. నూతనంగా పర్చూరు మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన పి వెంకట్రామయ్యకు కూడా ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛంతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే విషయంలో తాను కూడా ముందుంటానని వెంకట్రామయ్య ఉపాధ్యాయులతో అన్నారు. చివర్లో సన్మాన గ్రహీత నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు సహకరించిన ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. నూతన ఎమ్ఈఓకి కూడా సహాయ సహకారాలు అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనూకు, కెడివి ప్రసాద్, గనిపిశెట్టి గోవిందరావు, బొజ్జా సురేష్, చింపారెడ్డి, కాల్వ సోమశేఖర్, అంగిరేకుల శ్రీనివాసరావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, షఫీ, మాధవరావు, బొప్పూడి భానుప్రసాద్, కొల్లా శ్రీనివాసరావు, గుమ్మా లక్ష్మీనారాయణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త గ్రూపు పరీక్షలు

ప్రజాశక్తి-రేపల్లె

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రేపల్లెకు చెందిన వివేకానంద విద్యావిహార్ హైస్కూల్‌లో 306 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఎవరు ఏ గ్రూపునకు చెందుతారో నిర్ధారించి వారికి బ్లడ్ గ్రూపింగ్ కార్డులను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీర రాఘవయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా తప్పనిసరిగా తామ బ్లడ్ ఏ గ్రూపునకు చెందినదో తెలుసుకోవాలన్నారు. అది అత్యవసర సమయాలలో వారికే కాకుండా వారి కుటుంబ సభ్యులకు, సమాజానికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద విద్యా విహార్ ప్రిన్సిపల్ పివి జగన్నాథ్, డైరెక్టర్ ఏ సత్యనారాయణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ రేపల్లె కార్యనిర్వాహక కమిటీ సభ్యులు అడుసుమల్లి ప్రభాకర్‌రావు, సయ్యద్ కరిముల్లా, రక్త నిధి కేంద్రం స్టాఫ్ వంశీ, లక్ష్మణ్ కిన్నెర తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రేపల్లె

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించేందుకే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని రాజ్యసభ సభ్యుడు, వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండలంలోని ఉప్పూడి పంచాయతీలో శనివారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మోపిదేవి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా ప్రజలకు అందుతున్నాయని అన్నారు. నవరత్నాలను ప్రవేశపెట్టి వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనని కొనియాడారు. ఎన్నికల హామీలను 98 శాతం పైగా అమలు చేసినట్లు తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి కష్టాలను తెలుసుకుని సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, బసవయ్య అంటే నాగేంద్రమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యలవర్తి వెంకట్రావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

ప్రజాశక్తి-రేపల్లె

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తప్పవని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిరంతరం పర్యవేక్షణ చేయటం వలన మెరుగైన విద్య అందుతుందని అన్నారు. పట్టణంలోని వినోబాభావే మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల, సంజీవయ్య మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల, త్రిబుల్ ఎస్ మున్సిపల్ హైస్కూల్‌ను శనివారం తనిఖీ చేశారు. ఈ మేరకు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును పలు అంశాలను అడిగారు. ఉపాధ్యాయులు పాఠశాలలో అమలు చేయాల్సిన ఐదు ముఖ్య విషయాలు ఏమిటని ప్రశ్నించారు. సదరు ఉపాధ్యాయుడు సమాధానం చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. నేను పంచ భూతాలుగా చెప్పిన ఐదు విషయాలను జాగ్రత్తగా అమలు చేయాలని సూచించినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. గత విద్యా సంవత్సంలో వినియోగించిన పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్లో నాణ్యత ఉండాలని, అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించగలమని చెప్పారు. జగనన్న విద్యాకానుక పూర్తి కిట్‌ను విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. ఆగస్టులో జరగనున్న యూనిట్ టెస్ట్‌లో విద్యార్థులందనూ ఆంగ్లంలోనే సమాధానాలు రాసేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని, అలా కాని పక్షంలో సదరు ఉపాధ్యాయుడు ఉపాధ్యాయునితో సెక్రటేరియట్లో సమావేశమై తదుపరి కార్యాచరణ గురించి చర్చిస్తానని పరోక్షంగా హెచ్చరించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతని సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థులకు మేలు చేయాలని ప్రతి పాఠశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. అనంతరం తాను పంచభూతాలుగా నామకరణం చేసిన ఐదు పనులు వివరించారు. జగనన్న విద్యా కానుకల కిట్లు విద్యార్థులకు సక్రమంగా అందించాలని, యూనిట్ టెస్ట్ పరీక్షలను ఇంగ్లీష్ మీడియంలో రాసే విధంగా విద్యార్థులకు బోధించాలని, పాఠశాలకు స్మార్ట్ టీవీలు ఇస్తే వాటిని ఉపయోగించాలని, ఏ వారంలో పాఠ్య ప్రణాళికలు ఆ వారంలోనే పూర్తి చేయాలని, పిల్లలను ఎప్పటికప్పుడు చెక్ చేస్తూ ఉండాలని వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ, అర్థం కాని అంశాలను పదే పదే భోదించాలన్నారు. ఆయన వెంట మండల విద్యా శాఖ అధికారులు నవీన్‌కుమార్, శ్రీహరి, రత్న శ్రీధర్ మున్సిపల్ కమిషనర్ విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న భగవాన్‌నాయక్

ప్రభుత్వ వైద్యకళాశాల

అభివృద్ధికి కృషి

- బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్ డాక్టర్ చిరుతోటి సుధాకర్‌బాబు
- శుభాకాంక్షలు తెలిపిన సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల సహకారంతో ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రిన్సిపల్ డాక్టర్ చిరుతోటి సుధాకర్ బాబు తెలిపారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్‌గా నియమితులైన డాక్టర్ చిరుతోటి సుధాకర్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్నత ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తానన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి, అధికారులు తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించారని, జిజిహెచ్ సూపరింటెండెంట్, హెచ్‌ఒడిలు, వైద్యులు, సిబ్బంది సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ మాట్లాడుతూ అపారమైన అనుభవం ఉన్న డాక్టర్ సుధాకర్‌బాబు ప్రిన్సిపాల్ గా రావడం శుభపరిణామని, పరస్పర అవగాహన తో ముందుకు వెళ్ళి మంచి సేవలు ప్రజలకు అందిస్తామన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చిరుతోటి సుధాకర్‌బాబుకు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీ నాయక్, ఆర్ఎంఒ డాక్టర్ చైతన్య వర్మ, డాక్టర్ ఎల్.రిచర్డ్స్, బయో కెమిస్ట్రీ విభాగాధిపతి వెంకటరమణ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జాలాది మణిబాబు శుభాకాంక్షలు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

శాసనసభ్యులు కేపీ నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని మార్కాపురం శాసనసభ్యులు కేపీ నాగార్జునరెడ్డి పేరొన్నారు. మండల పరిధిలోని రాజుపాలెం గ్రామం శనివారం సాయంత్రం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ్యులు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో గల దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక నాయకుతో కలిసి ప్రతీ గడప గడపకు వెళ్లి నాలుగేళ్ళ పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా.. లేదా.. అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కార్యక్రమంలో గ్రామ సర్పంచి వెన్నా మహేశ్వరి సుబ్బారెడ్డి, ఇన్చార్జి ఎంపీడీవో నరసింహులు, ఏవో దేవి రెడ్డి శ్రీనివాసులు, జడ్పిటీసీ సభ్యులు నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ పోరెడ్డి అరుణ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మాజీ జెడ్పిటిసి జవ్వాజి రంగారెడ్డి, ఇడుపూరు మాజీ ఎంపిటిసి బట్టగిరి తిరుపతిరెడ్డి, ఇడుపూరు ఎంపీటీసీ కవలకుంట్ల పేతురు, ఎపిఎం రమేష్‌బాబు, మండలంలోని ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలి: తహశీల్దార్

ప్రజాశక్తి-పామూరు

ప్రభుత్వ పథకాలు ప్రతి కుటుంబానికీ అందించడం జరుగుతుందని తహశీల్దారు ఆవుల సురేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వగ్గంపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సురేష్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడం జరుగుతుందని గ్రామస్తులకు తెలిపారు. ఏమైనా సమస్యలుంటే అర్జీ ద్వారా సచివాలయంలో ఇవ్వాలని వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి బ్రహ్మానందరెడ్డి, విఆర్‌ఒ మహమ్మద్‌రఫీ, వైసిపి జిల్లా నాయకులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ధర్నా

మరో పోరాటం తప్పదు: సిపిఎం



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జి.రమేష్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్తు చార్జీలు, సర్దుబాబు చార్జీలను వ్యతిరేకిస్తూ సిపిఎం నగర కమిటి ఆధ్వర్యంలో శనివారం స్థానిక 60 అడుగుల రోడ్డు జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్ మాట్లాడుతూ కరెంటు బిల్లులతో ప్రభుత్వం ప్రజలకు షాక్ ఇచ్చిందన్నారు. ఫిక్స్‌డ్ చార్జి, కస్టమర్ చార్జి, ట్రూఆప్ చార్జి, 2021 సంవత్సరం సర్దుబాటు చార్జీల పేరుతో బిల్లులో 82శాతం సర్దుబాటు చార్జీలు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులను దోచి కార్పొరేట్లకు జేబులు నింపుతోందన్నారు. కరెంటు బిల్లుల విషయంలో సర్కార్ ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని విమర్శించారు. రెండు రూపాయలకు కొనాల్సిన కరెంటు బహిరంగ మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.20కి కొంటున్నారని తెలిపారు. ఇందులో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుంటుందన్నారు. ఇప్పుడు ప్రతి ఇంటికి, షాపుకు స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారని, దీని ఖర్చు ప్రతి మీటరుపై సుమారు రూ.13వేల వరకు ఉంటుందని తెలిపారు. దీనిని విడతల వారీగా ప్రజల నుంచే వసూలు చేయనున్నారని వివరించారు. సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలని, ట్రూఆఫ్ సర్దుబాటు చార్జీల వసూలు నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేశారు. విద్యుత్తు చార్జీల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు చార్జీల విషయంలో వెనక్కి తగ్గకపోతే అన్నీ వర్గాల ప్రజలను కూడగట్టి మరో విద్యుత్తు పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమానికి సిపిఎం 49వ డివిజన్ శాఖా కార్యదర్శి వి మాల కొండయ్య అధ్యక్షత వహించారు. మహిళా శాఖా కార్యదర్శి జి ఆదిలక్ష్మి, సిపిఎం స్థానిక నాయకులు సిహెచ్ రాజేశ్వరి, కె గురుస్వామి, ఎం శ్రీనివాసులు, పాపని సుబ్బారావు, యం నారాయణ, ధర్నాసి కోటయ్య, బి రాజ్యలక్ష్మీ , పి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి

ప్రజాసమస్యలు గుర్తించాలి: జేసీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వాలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు గుర్తించి, వచ్చేనెల ఒకటో తేది నుంచి జరిగే క్యాంపులకు వారిని తీసుకు వచ్చి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ (గ్రామ, వార్డు సచివాలయాల అధికారి) కె.శ్రీనివాసులు ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి నగరంలో ఇంటింటి సర్వే ప్రారంభమైంది. ఈ సర్వేను జాయింట్ కలెక్టర్ ఒకటో డివిజన్ త్రోవగుంటలో ప్రారంభించారు. కార్పొరేషన్ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి పలు గృహాలను సందర్శించి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికేట్లు ప్రజలకు అందజేయడం జరుగుతోందన్నారు. ఆయా సర్టిఫికేట్లు అవసరమైన వారిని గుర్తించి, అందుకు సంబంధించిన పత్రాలను వారి నుంచి సేకరించాలని వాలంటీర్లకు సూచించారు. వాలంటీర్లు గృహాలను సందర్శించినప్పుడు వారికి కేటాయించిన మొబైల్ యాప్‌లో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయా..? లేదా ..? అనే సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఇందుకోసం ప్రతి వాలంటీరు వారి పరిధిలోని ప్రతి ఇంటి వద్ద కనీసం 15 నిమిషాల సమయాన్ని కేటాయించాని చెప్పారు. అర్హులై ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందని పక్షంలో వారి వద్ద నుంచి ఆయా పథకాలకు అవసరమైన సర్టిఫికేట్లను సేకరించాలని చెప్పారు. వారి వద్ద ఆయా సర్టిఫికేట్లు అందుబాటులో లేకపోతే జగనన్న సురక్ష కార్యక్రమంలో వారి చేత దరఖాస్తు చేయించాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారిని క్యాంపులకు తీసుకు వచ్చి, వారికి అవసరమైన సర్టిఫికేట్లు క్యాంపుల ద్వారా ఇప్పించాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఒకటో డివిజన్ కార్పొరేటర్ కోటపూరి సామ్రాజ్యం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

మారుతీనగర్‌లో..

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా చేయాల్సిన గృహసర్వే గురించి స్థానిక 44వ డివిజన్ సచివాలయం మారుతి నగర్‌లో వాలంటీర్లతో కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు శనివారం సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం విధి విధానాలను వారికి వివరించారు. వెంటనే వాలంటీర్లు వారి పరిధిలోని గృహాలను సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజలకు ఉన్న సమస్యలను గుర్తించడం, వారికి అవసరమైన వివిధ రకాల సర్టిఫికేట్లను జారీ చేయడం జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాలరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

వెలిగొండ జలాలు టిడిపితోనే సాధ్యం: ముత్తుముల

ప్రజాశక్తి-బేస్తవారిపేట

వెలిగొండ జలాలు, మార్కాపురం జిల్లా సాధన తెలుగుదేశంతోనే సాధ్యమని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన చైతన్య రథయాత్ర శనివారం సాయంత్రం బెస్తవారిపేట మండలం, పెద్దఓబీనేనిపల్లె గ్రామం నుండి ప్రారంభమైంది. కంభం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుండి ఎల్. కోట గ్రామం చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్, కొండేపి శాసనసభ్యులు స్వామి, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ , కనిగిరి టీడీపీ ఇంచార్జ్ శ్రీ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు జి. నరసింహ యాదవ్ గారు, యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ శ్రీ గూడూరి ఏరిక్షన్ బాబు గారు, మాజీ ఎమ్మెల్సీ సభ్యులు బత్యాల చెంగల రాయుడు, శాసనాల వీర బ్రహ్మం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక 15వ డివిజన్ అన్నవరప్పాడులో రూ.35లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, కాలువ నిర్మాణానికి మేయర్ గంగాడ సుజాత, వైసిపి యువ నాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చింతపల్లి గోపిచంద్, ఇంజినీర్ కె మాల్యాద్రి, డిఈ రఘురాం, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ఈదర వెంకట సురేష్‌బాబు, యనమల నాగరాజు, కాంట్రాక్టర్ వేణుగోపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో..

స్థానిక 50వ డివిజన్ వెంకటేశ్వరకాలనీలో నూతనంగా వివిధ ప్రదేశాలలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు శనివారం నగర మేయర్ గంగాడ సుజాత, వైసిపి యువ నాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, ఇంజినీర్ కె మల్యాద్రి, అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్ అంజిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, స్థానిక వైసిపి నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, రాములు, మారుతి, రమేష్, రవి, కోటి, చంద్ర, శ్రీనివాసరావు, మల్లీశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీలో నేతలు, అధికారులు పర్యటించారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని, రోడ్డు సమస్యను త్వరలోనే తీరుస్తామని వారికి హామీ ఇచ్చారు.

స్కూల్ ప్లాన్ తప్పక పాటించాలి: ఎంఇఒ

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వ పాఠశాలల్లో స్కూలుప్లాన్ తప్పక పాటించాలని ఎంఈఓ టి రవి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమైందని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఇయర్‌ప్లాన్, లెసన్‌ప్లాన్, డైరీలు విధిగా పాటించాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, పరిశుభ్రత పాటించాలన్నారు. జెవివి కిట్లు వందశాతం పంపిణీ చేయాలన్నారు. అడ్మిషన్లు ముమ్మరం చేయాలని, విద్యార్థులలో విద్యాప్రమాణాలు పెంచడానికి కృషి చేయాలన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ-2 కె.శివాజీ మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో స్కూలు కాంప్లెక్స్ ఛైర్మన్లు టిఎల్ కాంతారావు, తులసికుమారి, రంగారావు, రాంబాబు, భాస్కరశాస్త్రీ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ రవి


కరపత్రం ఆవిష్కరిస్తున్న గాలి వెంకటరామిరెడ్డి

7న ఒంగోలులో సెమినార్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వ్యవసాయ రంగ సంక్షోభం, పరిష్కార మార్గాలు అనే అంశంపై జులై నెల 7వ తేదిన ఒంగోలులోని బృందావన కల్యాణ వేదిక నందు సెమినార్ నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన సెమినార్‌కు అధిక సంఖ్యలో రైతులు హాజరు కావాలని కోరుతూ చిన్న దోర్నాల గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. సెమినార్‌లో రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విజుకృష్ణన్, రాజకీయ విశ్లేషకులు కె నాగేశ్వర్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, మలారెడ్డి, రంగారెడ్డి, వెంకటరెడ్డి, అంజిరెడ్డి, పోలిరెడ్డి, ముసలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ-2 శ్రీనివాసులు

మాలకొండయ్య దాతృత్వం మరువలేనిది

ప్రజాశక్తి-పిసిపల్లి

త్యాగంరెడ్డి మాలకొండయ్య దాతృత్వం మరువలేనిదని ఎంఇఓ-2 ఆర్.శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని నేరేడుపల్లి, హైస్కూల్‌లో 10వ తరగతిలో 550 మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వపువిద్యార్థులు సన్మానం చేసి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.అంజనిదేవి అధ్యక్షతన జరిగింది. నగదు బహుమతి మొత్తాన్ని నేరేడుపల్లి మాజీ సర్పంచి త్యాగంరెడ్డి కొండారెడ్డి కుమారుడు మాలకొండయ్య అందజేశారు. కార్యక్రమంలో పిసిపల్లి, కనిగిరి, వెలిగండ్ల, మర్రిపూడి ఎంఇఓలు దాస్‌ప్రసాద్, నారాయణరెడ్డి, రామిరెడ్డి, డిఆర్.ప్రసాద్‌రెడ్డి, నేరేడుపల్లి సర్పంచి పల్లా మల్లికార్జున, సిఎంసి చైర్మన్ ఒద్దుల రమణారెడ్డి, ఎంపిపి అత్యాల జహన్య, యుటిఎఫ్ నేత గౌస్, పాఠశాల పూర్వపు విద్యార్థులు, మాంటిస్సోరి స్కూల్ కరస్పాండెంట్ సంగతి పిచ్చిరెడ్డి, రైల్వే సీనియర్ నీల్‌గార్డు వంజా చంద్రయ్య, మురుగమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

సమస్యల పరిష్కారం కోసమే సురక్ష..

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి పథకాలను అందించి వారి సమస్యలను పరిష్కరించడమే జగనన్న సురక్ష పథకం ముఖ్య ఉద్దేశమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి నారదముని అన్నారు. శనివారం మండలంలోని సూరారెడ్డిపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు, ఎంపీడీఓ పి రత్నజ్యోతి, పంచాయతీ కార్యదర్శులు కె స్వర్ణ కుమార్, డి కిషోర్ బాబు, సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

'సురక్ష' సర్వే సమగ్రంగా చేయాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేస్తున్న జగనన్న సురక్ష పథకంలో ఇంటింటి సర్వే సుసమగ్రంగా చేయాలని జగనన్న సురక్ష పథకం పర్యవేక్షకులు, మండల ప్రత్యేక అధికారి సెరికల్చర్ ఏడిఏ నారాయణరెడ్డి అధికారులకు, వాలంటీర్లకు సూచించారు. శనివారం మండల పరిధిలోని బోడపాడు గ్రామంలో వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు కలిసి చేస్తున్న జగనన్న సురక్ష పథకం ఇంటింటి సర్వేలో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి.. మరి ఏ ఇతర కారణాలతోనైనా వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనట్లయితే అటువంటి వారిని గుర్తించి వారికి అవసరమైన ధృవీకరణ పత్రాలను సమకూర్చి సంక్షేమ పథకాలకు అర్హులుగా చేర్పించాల్సిన బాధ్యత వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులదేనన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ఇంటింటి సర్వేను చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రతి ఇంటికి వెళ్లి వారి వివరాలను సమగ్రంగా తెలుసుకొని వారి ఫోటోలు

మండల ప్రత్యేక అధికారి నారాయణరెడ్డి


బోడపాడులో సురక్ష సర్వే నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం సూచించిన యాప్ లో పొందుపరచాలన్నారు. జూలై ఒకటో తేదీ నుండి ప్రతి సచివాలయంలో ప్రత్యేక అధికారులు సర్టిఫికెట్లు మంజూరు చేసేందుకు క్యాంపులు నిర్వహించి అక్కడికక్కడే ఉచితంగా సర్టిఫికెట్లు మంజూరు చేసి అర్హులకు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం సర్వే చేస్తున్న బృందం సభ్యులకు పలు సలహాలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి ఎం.రామ్మోహన్‌రెడ్డి, బోడపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి అబిద్ హుస్సేన్, అగ్రికల్చర్ అసిస్టెంట్ గోపి, ఏఎన్ఎం విష్ణు ప్రియ, డిజిటల్ అసిస్టెంట్ అనూష రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దు..

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

శిక్షణ ఐపీఎస్ అధికారి అంకిత సురానా

నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికావొద్దని మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఇంఛార్జి, శిక్షణ ఐపీఎస్ అధికారి అంకిత సురానా మహావీర్ సూచించారు. శనివారం నో ఆక్సిడెంట్‌ను పురస్కరించుకొని మండల పరిధిలోని కోమటికుంట జంక్షన్ వద్ద వాహనాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడం కోసం పోలీస్ శాఖ


వాహనదారులతో మాట్లాడుతున్న శిక్షణ ఐపీఎస్ అధికారి అంకిత సురానా

అధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రమాదాలనివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ ఎస్ఐ ఆర్.సుమన్, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐకి సమస్యల స్వాగతం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల ఎస్సైగా పనిచేసిన శ్రీనివాసరావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నూతన ఎస్సైగా అంకమరావు బాధ్యతలు చేపట్టనున్నారు. నూతన ఎస్సైకు ట్రాఫిక్ సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే నటరాజ్ సెంటర్ కూడలిలో ఆవులు సంచరిస్తుంటాయి. తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్ల మీదకు వచ్చి వ్యాపారాని సాగిస్తుంటారు. టి కొట్లు, టిఫిన్ హోటళ్ల వాటి ముందు బల్లలను రోడ్ల పైన కూడా వేస్తుంటారు. నిత్యం 300 బస్సులు దాకా శ్రీశైలం, కర్నూలు ప్రాంతాలకు బస్సులు తిరుగుతుంటాయి. ఇతర వాహనాలు సైతం వంద సంఖ్యలో వచ్చిపోతుంటాయి. అయితే ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొనక తప్పడం లేదు. తిమ్మాపురం సెంటర్‌లో సైతం ఆక్రమణలు అధికమయ్యాయి. రోడ్డు ప్రమాదాలు సైతం అధికంగానే జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని నూతన ఎస్సైకు దోర్నాల పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరితగతిన 'నాడు-నేడు' పనులు పూర్తి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఇఓ-1 ప్రసాదరావు శనివారం అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ-2గా బాధ్యతలు చేపట్టిన కొండారెడ్డి పరిచయ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు పనులపై నివేదిక అందజేయాలని సూచించారు. ఈ నెల 26, 27తేదీల్లో పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మఒడిపై అవగాహన కలిగించాలన్నారు. అనంతరం మండలానికి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ

ఎమ్మెల్యే బుర్రాను కలిసిన ఎస్ఐ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం ఎస్ఐ శివనాగరాజు శనివారం కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు అంశాలపై చర్చించారు. వీరి వెంట ఆదినారాయణరెడ్డి, కనిగిరి సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ వేల్పుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

'టిబి ముక్త్ పంచాయతీ'పై సదస్సు

ప్రజాశక్తి-తర్లుపాడు

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో టిబి ముక్త్ పంచాయతీ అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం యూనిట్ క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నరసింహులు, మార్కాపురం సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ గోవిందరాజులు, టిబి హెల్త్ విజిటర్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

సురక్షపై అవగాహన

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలోని ముప్పళ్లపాడులో ఎంపిడిఓ జివి.కృష్ణారావు జగనన్న సురక్ష పథకం గురించి ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-మద్దిపాడు


వైద్యసేవలందిస్తున్న కిమ్స్ డాక్టర్

స్థానిక కడియాల యానాదయ్య హై స్కూల్ నందు ఒంగోలు నగరానికి చెందిన కిమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని పాఠశాల హెచ్ఎం అబ్దుల్ అజీమ్ ప్రారంభించారు. వైద్య శిబిరం నందు ఎస్సీ- ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు, హైస్కూల్ విద్యార్థులకు డాక్టర్ బి. రామాంజనేయులు 240 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జనరల్ చెకప్, డెంటల్, ఇతర వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో కిమ్స్ వైద్యులు డాక్టర్ బి. రామాంజనేయులు, డాక్టర్ హైందవి, డాక్టర్ సుదీక్ష, ఉపాధ్యాయులు కోటిరెడ్డి కిమ్స్ పిఆర్ఓ పి.రత్నకుమార్, కిమ్స్ వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జంధ్యాల చంద్ర భాస్కరశాస్త్రి మృతి

ప్రజాశక్తి-జరుగుమల్లి


జంధ్యాల (ఫైల్)

ప్రముఖ జ్యోతిష్యుడు, వేద పండితులు, డాక్టర్ జంధ్యాల చంద్ర భాస్కరశాస్త్రి శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు మృతిచెందారు. ఈయన ఇటీవల అనారోగ్యానికి గురై వైద్య చికిత్స పొందుతూ స్వగ్రామమమైన నర్సింగోలు వచ్చారు. మండలంలోని నర్సింగోలు గ్రామంలోని ప్రత్యేక లింగ రూప శనీశ్వరాలయ ప్రధానార్చకులు గానూ, శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరాలయ ప్రధాన అర్చకులు గానూ వున్నారు. ఇటీవల అమెరికా వెళ్లి తెలుగు వారితో సన్మానం పొందారు. ఈయన కుమారుడు చిత్ర పరిశ్రమలో సహాయ దర్శకులుగా పని చేస్తున్నారు. చిత్ర పరిశ్రమనకు చెందిన ప్రముఖ దర్శకులు బోయపాటి శ్రీను ప్రత్యేక లింగరూప శనీశ్వరాలయంలో పలు మార్లు డాక్టర్ జంధ్యాల చంద్ర భాస్కరశాస్త్రి చే పూజలు చేయించుకున్నారు. డాక్టర్ జంధ్యాల అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

జగనన్న సురక్ష ప్రారంభం

ప్రజాశక్తి-రాచర్ల

మండలంలోని ఆరవీటి కోట, కొత్తురు గ్రామాల్లో శనివారం ప్రజాప్రతినిధులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి దేవదానం, ఎంపిటీసీ పి విమలాదేవి, పంచాయతీ కార్యదర్శులు శివరామకృష్ణ, నారాయణస్వామి, వైసిపి నాయకులు పోతిరెడ్డి శంకరరెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గిద్దలూరు తహశీల్దార్ కె.విజయకుమారి మండలంలోని అంబవరం గ్రామంలో శనివారం ప్రారంభించారు. తహశీల్దార్ గ్రామంలోని ఇంటింటిని సందర్శించి ప్రభుత్వ పథకాలు లబ్ధత, ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ సూర్య నారాయణరెడ్డి, ఈఓఆర్డి చెన్నారావు, పంచాయతీ కార్యదర్శి భూతేష్‌రెడ్డి, వీఆర్వో అచ్చయ్య పాల్గొన్నారు.

బిఎల్‌వోలకు శిక్షణ

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండల బిఎల్ఓలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క బిఎల్ఓ ఓట్లు చేర్పింపు, తొలగింపు విషయంపై జాగ్రత్త వహించాలని తెలిపారు. మరణించిన, డబుల్ ఎంట్రీ ఓట్లను గుర్తించి వాటిపై శ్రద్ధ పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి వి రమణారావు, డిప్యూటీ తాసిల్దార్ అర్జున్ రెడ్డి ,ఈఓఆర్డి బాల చెన్నయ్య పాల్గొన్నారు.

25న చైతన్య రథయాత్ర

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదిన సాయంత్రం 5 గంటలకు దోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రతో పాటు రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పెద్దదోర్నాల టిడిపి మండల అధ్యక్షుడు ఏరువ మల్లికార్జునరెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పథకాలు అందనివారిని గుర్తించేందుకే 'సురక్ష'

ప్రజాశక్తి-కొల్లూరు

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి అందించటమే సురక్ష పథకం ముఖ్య లక్ష్యమని ఎంపీడీవో ఐ సత్యనారాయణ అన్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆయన ప్రకటించారు. జులై 1న అనంతవరం, చిలుమూరు, 4న ఈపూరు, ఈపూర్ లంక, 6న గాజులంక, పెసర్లంక, 11న క్రాప, దోనేపూడి, 13న రావికంపాడు, చిన్న పులివర్రు, 15న పోతర్లంక, జువ్వలపాలెం, 18న కొల్లూరు 3, కిష్కిందపాలెం, 20న కొల్లూరు, కొల్లూరు-1, కొల్లూరు-3 సచివాలయాలలో ఈ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి సిహెచ్ రవిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టు పరిశ్రమ శాఖ పర్యవేక్షణాధికారి

మల్బరీ సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి-కొల్లూరు

మల్బరీ తోటల సాగుపై రైతులు అధిక లాభాలు సాధించవచ్చునని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పట్టు పరిశ్రమ శాఖలో మల్బరీ తోటలు యాజమాన్యం పద్ధతులు, పట్టుపురుగుల పెంపకం, ఆధునిక పద్ధతులపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్సీ ఎస్టీలకు 90 శాతం, జనరల్‌కు 75 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు ఆయన వివరించారు.



కల్లంవారిపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న హౌసింగ్ పీడీ ప్రసాద్

అర్హులందరికీ సంక్షేమమే 'సురక్ష' లక్ష్యం

ప్రజాశక్తి-పంగులూరు

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందజేయాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని, మండల ప్రత్యేక అధికారి, హౌసింగ్ పిడి ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కల్లంవారిపాలెం, అలవలపాడులో ఎంపీడీవో రామాంజనేయులు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హత ఉన్న ఏ కారణం చేతైనా సంక్షేమ పథకాలను సేవలను పొందలేని వారిని గుర్తించి వారికి పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ఫంక్షన్లు, అమ్మఒడి తదితర సంక్షేమ పథకాలు వస్తున్నాయా లేదా అని అధికారులు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి కావలసిన సంబంధిత పత్రాలను పరిశీలించి న్యాయం చేస్తామని ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

కరి నాగేశ్వరరావు మాస్టారు మృతి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్




ఇంకొల్లుకు చెందిన విశ్రాంత తెలుగు పండిట్, కళాకారుడు కరి నాగేశ్వరరావు(75) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. చాలా సంవత్సరాల పాటు దగ్గుబాడు హైస్కూలులో తెలుగు పండిట్‌గా పని చేసి అందరి మన్ననలు పొందారు. చిన్న నాటి నుంచి నాటకాలపై ఉన్న ఆసక్తితో కళాకారుడుగా అనేక ప్రదర్శనలు, అవార్డులు సాధించారు. విశ్వామిత్ర, రామనాసుడు, దుర్యోధన పాత్రల్లో నాగేశ్వరావు రాణించారు. నాగేశ్వరరావు మరణ వార్త తెలుసుకొని పలువురు ఉపాధ్యాయులు, కళాకారులు, పలు సాహితీ సంస్థలు నాగేశ్వరరావు మృతికి నివాళులర్పించారు. నాగేశ్వరరావుకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

భూ యజమానులు కౌలు రైతులకు సహకరించాలి

ప్రజాశక్తి-పంగులూరు

భూ యజమానులు వారి భూమిని కౌలుకు తీసుకుని కౌలు వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు సహకరించాలని తహశీల్దారు పద్మావతి కోరారు. భూ యజమానుల పొలం పాస్ బుక్కు జిరాక్సులు, వారి పొలం సాగు చేసే కౌలు రైతులకు ఇచ్చి కౌలు అంగీకార పత్రం మీద సంతకం చేస్తే కౌలు రైతులకు ప్రభుత్వం కౌలు కార్డు ఇస్తుందని ఆమె చెప్పారు. మండలంలోని కొండమూరు గ్రామంలో కౌలు రైతులకు సిసిఆర్సి (కౌలు కార్డులు) మీద అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దారు పద్మావతి మాట్లాడుతూ, కౌలు కార్డుల వలన భూ యజమానికి, సాగుదారికి ఇద్దరికీ రైతు భరోసా వర్తిస్తుందని తెలిపారు. వివిధ కారణాలవల్ల పంట నష్టం జరిగినప్పుడు, నేరుగా కౌలు రైతు అకౌంట్లో నష్టపరిహారం జమ చేస్తారని, దీనివలన కౌలు రైతు నష్టపోయే అవకాశం ఉండదని ఆమె తెలిపారు. భూ యజమానులు మీ దగ్గర భూమిని కౌలుకు తీసుకొని కష్టపడి వ్యవసాయం చేసి పంటలు పండించే కౌలు రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత భూ యజమానులపై ఉందని, అందువలన వారికి కౌలు కార్డు వచ్చే విధంగా భూ యజమానులు పాస్ బుక్కు జిరాక్స్‌లు ఇచ్చి, అంగీకార పత్రంపై సంతకం చేయాలని ఆమె కోరారు. మండల వ్యవసాయ శాఖ అధికారి డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, కొండమూరు గ్రామంలో కౌలు రైతులు అధికంగా ఉన్నారని, పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలని తెలిపారు. కౌలు కార్డుల వలన భూ యజమానులకు, వారి హక్కులకు ఎటువంటి భంగం కలగదని, కేవలం పొలంలో వేసిన పంట మీద కౌలుదారుడికి 11 నెలలు మాత్రమే హక్కు ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం కొంతమంది కౌలు రైతులకు తహశీల్దారు పద్మావతి కౌలు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి రవి, గ్రామ వ్యవసాయ సహాయకుడు దినేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

నగరం: నగరం మండలంలోని ఈదుపల్లి, పూడివాడ, పెదమట్లపూడి గ్రామాల్లో ఆర్బికెల పరిధిలోని కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలపై (సిసిఆర్సి) అవగాహన సదస్సులు మండల వ్యవసాయ అధికారి వి రమేష్ బాబు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ఆయన



నగరం మండలంలో కౌలు రైతుకు కార్డు అందజేస్తున్న దృశ్యం

మాట్లాడుతూ భూ యజమానులకు నష్టం వాటిల్లకుండా కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాల జారీకి ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. కౌలు చేసుకొనే ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డు తీసుకోవాలని సూచించారు. ఈ కార్డు ఒప్పంద కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. ఈ కార్డు ద్వారా సాగుదారులకు భూమిపై ఎటువంటి హక్కు ఉండదని, కేవలం పంటపైన మాత్రమే హక్కు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె నాగశ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎన్ కిరణ్మయి, వీఆర్వో సిహెచ్ సుధాకర్, ప్రజా ప్రతినిధులు, గ్రామ వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం: పిట్టలవాని పాలెం మండలం ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సమిష్టిగా సాగుదారులకు శుక్రవారం పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తహశీల్దారు కవిత పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ భూమిలేని వాస్తవ సాగుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ శాఖ వారు అందించే వివిధ ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాజీపాలెం గ్రామ సర్పంచ్ కుంతం అనూష ప్రసన్న, పిఎసిఎస్ పర్సనల్ ఇంచార్జ్ డి దేవేంద్రరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి, సిహెచ్ సుదర్శన్‌రావు, గ్రామ రెవెన్యూ అధికారి నాగరాజరెడ్డి, గ్రామ సచివాలయం కార్యదర్శి వి శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు వి షాలేంరాజు, వి జాన్‌రాజు, గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అద్దంకిలో ప్రతిభామూర్తుల సభ

అద్దంకి: పట్నంలోని చిన్ని శాంతయ్య పిచ్చమ్మ గార్ల సేవాసదన్‌లో ప్రతిభామూర్తుల సభ శనివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డిపో కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం కార్యదర్శి ఎం హనుమంతరావు సభా ఆహ్వానం చేయగా సంఘం అధ్యక్షులు అధ్యక్షత వహించారు. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకొని వారి సినీ జీవిత విశేషాలు సాహితీ స్రవంతి అధ్యక్షులు చందలూరి నారాయణరావు వివరించారు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ జీవిత విశేషాలపై యువకవి డివిఎం సత్యనారాయణ మాట్లాడారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం, డొక్కా సీతమ్మ చిత్రపటాలకు తొలుత పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ సామాజిక, సాంస్కృతిక, సంగీత, సాహిత్య సంస్థల సభ్యులు వీరిని స్మరించుకున్నారు. యు దేవపాలన, ఆర్‌వి రాఘవరావు, చప్పిడి వీరయ్య, రుద్రయ్య, లేవీ ప్రసాద్, మోటుపల్లి రామదాసు, శేషగిరి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు వివి బ్రహ్మం, టిఎన్ రావు, ఎస్‌కె కాలేషా, మస్తాన్, ఖాసిం పాల్గొన్నారు.

అధ్వానంగా చందోలు-పొన్నూరు రహదారి

అత్యవసరంగా వైద్యం కోసం వెళ్లాలన్నా తప్పని ఇక్కట్లు ● రహదారి వెంట చెట్లను అమ్ముకుంటున్న ఘనులు

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం



సుభాన్ ఖాన్ (ఫైల్)

చందోలు-పొన్నూరు రహదారి అధ్వానంగా ఉంది. ఎంతో కాలంగా ఈ రోడ్డు పాడై ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం ఉండటం లేదు. ఈ రహదారి బాగులేనందున వైద్యశాలకు త్వరగా వెళ్లలేకపోవడంతో పలువురు మృత్యువాత పడుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఛందోలు గ్రామానికి చెందిన సుమారు 32 ఏళ్ల సుభాన్ ఖాన్ శుక్రవారం రాత్రి తనకు గుండె దగ్గర సన్నగా నొప్పి రావటంతో స్థానిక ఆర్‌ఎంపి వద్ద ఇంజక్షన్ చేయించుకున్నాడు. అయినా నొప్పి తగ్గకపోవటంతో పొన్నూరు వెళ్లాలని తలంచాడు. ఆ రహదారి బాగులేకపోవడంతో చెరుకుపల్లి వెళ్లాడు. అక్కడ గుండెకు సంబంధించిన వైద్యం లేకపోవటంతో తిరిగి పొన్నూరు వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ సంఘటనతో ఛందోలు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వయసులో ఉన్న కుర్రవాడు, అందరికీ సాయం చేస్తూ ఉన్న వ్యక్తి మరణించటంతో గ్రామస్థులు ప్రభుత్వ పని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రహదారి బాగుంటే ప్రాణాలు మిగిలేవి అంటూ ప్రభుత్వం యొక్క పోకడను ప్రజలు దుయ్యబడుతున్నారు. అంతేకాక అనేక గ్రామాలకు పొన్నూరు వెళ్లాలి అంటే ఇది ఒక్కటే మార్గం. ముఖ్యంగా వైద్యం కోసం అనేక మంది వ్యాధిగ్రస్తులు పొన్నూరుకు నిత్యం వెళుతూ ఉంటారు. రహదారి ఛిద్రంగా ఉండటం వలన మార్గమధ్యంలోనే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి తోడు రహదారి పక్కన ఎన్నో సంవత్సరాల నుంచి ఉండే చెట్లను అమ్మి అక్రమార్కులు లక్షల్లో సొమ్ము చేసుకున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారి మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండల పరిధిలోని ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ దానేలు ఇటీవల మృతి చెందాడు. శనివారం దానేలు దశదినకర్మకు అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ హాజరై దానేలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంత రం వారి కుటుంబ సభ్యుల పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈయన వెంట ఉప్పుమాగులూరు మాజీ సర్పంచ్ అమర్నేని కాశయ్య, ఉప్పుమాగులూరు తెలుగు యువత అధ్యక్షులు మునుగోటి కృష్ణ కిషోర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా సట్టు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండలంలోని గుంటుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతున్న గ్రామ దేవత సట్టు పోలేరమ్మ తల్లి ద్వితీయ వార్షిక మహోత్సవ తిరుణాల ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో, నిమ్మకాయ దండలతో వినూత్నంగా ముస్తాబు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలతో నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, బృందావన భజనలు ఏర్పాటు చేశారు.

జగనన్న కాలనీని మీ సొంత సొమ్ముతో నిర్మించారా?

ప్రజాశక్తి-భట్టిప్రోలు

జగనన్న కాలనీ లబ్ధిదారులకు స్థలంతోపాటు గృహం కూడా నిర్మిస్తామని నమ్మబలికి ప్రజలను మోసం చేసి నేడు అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకోవటానికి వెళ్లే ప్రతిపక్ష నాయకులకు కాలనీలో తిరిగే హక్కు లేదని మంత్రి నాగార్జున అనటం విడ్డురంగా ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేల కోట్లు రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన జగనన్న కాలనీ స్థలాలు మీ సొంత సొమ్ముతో కొనుగోలు చేశారా? అని ఆయన మంత్రి నాగార్జునను ప్రశ్నించారు. నివాస యోగ్యం కానీ భూములు మీ స్వార్థ ప్రయోజనాల కోసం కొనుగోలు చేయటమే కాక కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం చెందలేదా అని ప్రశ్నించారు. ప్రజా ధనంతో చేపట్టే ఏ పనినైనా పరిశీలించే అధికారం ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిందని, అలాంటి కనీస ఆలోచన మంత్రి నాగార్జునకు లేకపోవటం విచారకరమన్నారు. జగనన్న కాలనీలో టిడిపికి తిరిగే అర్హత లేనప్పుడు టిడిపి వేసిన రోడ్లపై తిరిగే అర్హత మీకుందా అని ప్రశ్నించారు. గడచిన నాలుగేళ్ల పాలనలో వేమూరు నియోజకవర్గంలో కానీ, భట్టిప్రోలు మండలంలో గాని చేసిన అభివృద్ధి ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. తమ పాలనలో జరిగిన అభివృద్ధిపై గాని ప్రస్తుత పంచాయతీలో జరిగే అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా? అని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, అధిన బసవపున్నయ్య, కుమారస్వామి, లోకనంద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలో ఆయా గ్రామాలలో ఉన్న జగనన్న కాలనీలలో లబ్ధిదారులు త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు సూచించారు. హౌసింగ్ డేను పురస్కరించుకొని భట్టిప్రోలు మండలం గోరిగపూడి, పెదపులివర్రు గ్రామాలలో శనివారం మండల స్థాయి అధికారులతో కలిసి పర్యటించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పేదలకు స్థలాలు పంపిణీ చేసిందన్నారు. బేస్మెంట్ నిర్మాణానికి రూ.35 వేలు రుణం కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డివి లలితకుమారి, ఎంపిడిఓ చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్‌లు గరికపాటి మల్లిక, నీలా ఉషారాణి రమేష్, హౌసింగ్ ఏఈ సౌమ్య, కార్యదర్శి ఎండి జక్రియా, నాయకులు నీలా నాగరాజు తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిఘటించండి

- సిపిఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య పిలుపు
- 30న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టాలని నిర్ణయం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రప్రభుత్వం ప్రజల కళ్లుగప్పి దొడ్డిదారిన అడ్డగోలుగా విద్యుత్ ఛార్జీలు పెంచడం దారుణమని, ప్రజలు ప్రతిఘటించాలని సిపిఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని శనివారం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రావుల వెంకయ్య మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలతో సామాన్యులను దోచి కార్పొరేట్ల జేబులు నింపుతోందని దుయ్యబట్టారు. గోరు చుట్టుపై రోకటి పోటు చందంగా స్మార్ట్‌మీటర్లతో మరో ముప్పు తె చ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లతో ప్రతి మీటర్‌కు 37 వేల రూపాయలు వసూళ్లకు జగన్ ప్రభుత్వం పూనుకుంటోందని, వీటిని వెనక్కి తీసుకునే వరకు పోరాడాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ గతంలో రెండేళ్ళు, మూడేళ్ళకు ఒకసారి విద్యుత్ ఛార్జీలు పెంచేవారని.. మోడీ, జగన్ ప్రభుత్వాలు కుమ్మక్కై వంట గ్యాస్‌లా విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులే కాకుండా ఫిక్స్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో 25 వేలకు పైగా దోచుకున్నారన్నారు. ఇప్పటికైనా పెంచిన ఛార్జీలు మానుకోకపోతే ప్రభుత్వం బంగాళాఖాతంలో కలవటం ఖాయమన్నారు. ఈ నెల 30న ఒంగోలు కలెక్టరేట్ వద్ద దర్నా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఎంఎస్ సాయి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాద్యక్షులు శ్రీపతి ప్రకాశం, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు. ఐఎల్‌పి రాష్ట్ర కార్యదర్శి దాసరి సుందరం, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు టి.వెంకటస్వామి. లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎస్ఎమ్‌డి రఫీ, టిడిపి నాయకులు ఎస్‌కె అజిమున్నీసా, హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు నార్నె వెంకట సుబ్బయ్య, గుమళ్ల నరసింహరావు, పోలేరయ్య, కొంగర నరసింహం పంతులు, సుబ్బారావు, మాగులూరు నాగేశ్వరరావు, డిహెచ్‌పియస్ రాష్ట్ర నాయకులు కరవది సుబ్బారావు, నూనె మోహనరావు, వి.హనుమారెడ్డి, ఉప్పుటూరి ప్రకాశరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, పివిఆర్ చౌదరి, చుండూరి వెంకటేశ్వర్లు ప్రసంగించారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌పి మలిక గర్గ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది రహదారి భద్రతా నియమాలపై ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ముఖ్యమైన జంక్షన్ లు, బ్లాక్ స్పాట్స్/ఆక్సిడెంట్ ప్రొనె ఏరియా వద్ద ప్రజలకు, వాహనచోదకులకు అవగాహన ఫ్లెక్సీలు, వేగ నియంత్రణ కోసం మలుపుల దగ్గర సూచికలు, రేడియం స్టిక్కర్లతో బోర్డులు ఏర్పాటుచేయటం, జాతీయ రహదారిపై రోడ్డు భద్రత, రక్షణ, హెల్మెట్, అతివేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారులపై ద్విచక్రవాహనాలు నడుపుతూ ఉన్న వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. నో యాక్సిడెంట్ డే కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అంకిత సురాన, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టని

పాలకులకు గుణపాఠం చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



టిడ్కో ఇళ్ల వద్ద టిడిపి నేతల సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజాసమస్యలు పట్టని పాలకులకు గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. కనిగిరి మండలం గుడిపాడులోకి భవిష్యత్‌కు గ్యారెంటీ చైతన్యరథయాత్ర శుక్రవారం చేరుకోగా రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమంను టిడిపి నాయకులు చేపట్టి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనివారం గుడిపాడు నుంచి ప్రారంభమైన చైతన్యయాత్ర తాళ్లూరు, బొమ్మిరెడ్డిపల్లి, పునుగోడు మీదుగా కనిగిరి పట్టణంలోకి ప్రవేశించింది. తాళ్లూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కనిగిరి పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కనిగిరి పట్టణంలోని పురవీధులలో భారీ జనసందోహం నడుమ నాయకులు భారీ ర్యాలీగా అమరావతి గ్రౌండ్‌కు చేరుకున్నారు. అమరావతి గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టిడిపి నాయకులు నూకసాని బాలాజీ, మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందుల పాలుచేసేలా పాలన సాగిస్తున్న వైసీపీ నాయకులకు ఓట్లు అడిగే నైతిక హక్కులేదని విమర్శించారు. సభ అనంతరం చాకిరాల వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయం, టిటిడి కళ్యాణమండపం వద్ద సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, బేరి పుల్లారెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, బేరి పుల్లారెడ్డి, షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, చింతలపూడి తిరుపాలు, ఆర్‌వి నారాయణ పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పాలుట్లలో మంత్రి సురేష్ పర్యటన



పాలుట్లలో అంబు ఎక్కుపెడుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు రవాణా సౌకర్యం ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని యర్రగొండపాలెం నుంచి ప్రత్యేకంగా 15 జీపులను ఏర్పాటు చేసుకొని 47 కిమీ నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణం చేసి మధ్యాహ్నం రెండు గంటలకు మంత్రి సురేష్ పాలుట్ల చేరుకున్నారు. మార్గమధ్యలో నారుతడికల, పొన్నలబయలు గూడెంలలో గిరిజనులతో ఆప్యాయంగా మాట్లాడారు. పెద్దమ్మతల్లి బేస్ క్యాంపు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజనులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఎస్టీ కమీషన్, గిరిజన సలహా మండలి ఏర్పాటు చేశారని తెలిపారు. గిరిజనులకు శాశ్విత ఉపాధి కల్పించేలా ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను రికార్డు స్థాయిలో పంపిణీ చేసిన ఘనత కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గిరిజనులను చంద్రబాబు అంటరానివారిగా చేసి క్యాబినెట్‌లో కూడా అవకాశం ఇవ్వలేదని తెలిపారు. అయితే జగన్మోహన్‌రెడ్డి మాత్రం గిరిజనులను కుటుంబసభ్యులుగా చూస్తున్నారని చెప్పారు. ఇలాంటి ముఖ్యమంత్రి దొరకడం గిరిజనుల అదృష్టమన్నారు. అనంతరం 8 మందికి 150 రోజుల పని దినాలు కల్పిస్తూ ఉపాధి హామీ జాబ్ కార్డులు అందజేశారు. గర్భిణీలు, బాలింతలకు ఐసీడిఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం పంపిణీ చేశారు. పొన్నలబయలు గూడెం చుట్టూ చిల్లచెట్లు తొలగించకపోతే పాములు, ఇతర జంతువుల ఇబ్బందులు ఉన్నాయని గిరిజనులు కోరటంతో తన సొంత ఖర్చుతో జేసీబీని పంపి చెట్లు తొలగిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మధ్యాహ్నం పాలుట్లకు చేరుకున్న మంత్రి సురేష్‌కు గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు. గూడెంలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. నూతనంగా రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని, రూ. 5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి సురేష్ ప్రారంభించారు. అనంతరం గూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. గిరిజనుల విల్లంబులు పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి యువనేత ఆదిమూలపు విశాల్, ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, డీఎస్పీ వీరారాఘవరెడ్డి, ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్, డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం శ్రీనివాసరావు, పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్‌లతో పాటు అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ యాత్రలు



ఎన్నికలు సమీపిస్తున్నందున.. అధికారమే ఎజండాగా పాలక, ప్రతిపక్ష పార్టీలు కదులుతున్నాయి. రాజకీయ యాత్రలూ తెరపైకి వస్తున్నాయి. యాత్రా సమయం వచ్చేసింది. తాజాగా తెలుగుదేశం పార్టీ చైతన్య యాత్రలు పేరుతో బస్సుయాత్ర చేపట్టారు. అన్ని నియోజక వర్గాల్లోయాత్రకు నేతలు స్వాగతాలు పలికారు. బస్సులో వచ్చిన నేతలు ప్రభుత్వంపై ధ్వజమెత్తడమే ఎజండాగా పెట్టుకున్నారు. ఒంగోలు నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర అన్ని నియోజకవర్గాల్లో సాగింది. పల్లెనిద్ర పేరుతో నియోజకవర్గ స్థాయి నేతలు గ్రామాల్లో పడుకుంటున్నారు. సభల్లో సిఎం జగన్‌పైనా, ప్రభుత్వంపైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. సిఎం జగన్‌ను గద్దె దింపడమే ఈ యాత్రల లక్ష్యంగా చెప్పారు. ఏదేమైనా తెలుగుదేశం నేతలు జిల్లాఅంతటా ఈ వారం రోజులుగా యాత్రల పేరుతో కదిలారు. సభలు పెట్టారు. ర్యాలీలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు అందరూ ఇందులో భాగస్వాములయ్యారు. కార్యకర్తలు కదిలారు. గ్రామాల్లోనూ కదలిక తెచ్చారు. ఎన్నికల్లో పోరాటానికి సిద్ధం కావాలని మరోసారి పార్టీ క్యాడర్‌కు గుర్తు చేశారు. ప్రభుత్వంపై విమర్శలు తప్ప ఆయా సమస్యలపై స్థానికంగా పోరాటాలు గానీ, ఆందోళనలు గానీ చేపట్టే దిశగా తెలుగుదేశం కనిపించడం లేదు.

విద్యుత్ ఛార్జీలపై వామపక్షాలు కదిలాయి. పలు రకాల పేరుతో కరెంటు ఛార్జీలను పెంచడాన్ని వామపక్షాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పార్టీలవారీగానూ.. ఐక్యంగానూ ఆందోళనలు చేపట్టాయి. నిరసనలు ఇప్పటికే చేపట్టిన పార్టీలు భవిష్యత్‌లోనూ ఆందోళనలు తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. ట్రూఅప్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సేవా పన్నులు, ఫిక్స్‌డు ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, యూజర్ ఛార్జీలు ఇలా అనేక పేర్లతో అదనంగా బాదుతున్నారు. వీటిపై జనం భగ్గుమంటున్నారు. సంక్షేమ పథకాలు ప్రచారంలో వీటిని పక్కనబెడుతున్నారు. వార్డుల్లో వాలంటీర్లను తిప్పుతూ ఏదో ప్రచారం కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చి జనం దృష్టి భారాలపై పడకుండా చేస్తున్నారు. ఈనెలలో కరెంటు బిల్లులు సుమారు 30శాతంపైగా పెరిగాయి. గత నెలతో పోలిస్తే బిల్లులు భారీగా తేడాలున్నాయి. అద్దె ఇళ్లవారికి సంబంధం లేకున్నా చెల్లించాల్సి వస్తోంది. ఇలా ఏదో రూపంలో కరెంటు ఛార్జీలు పెంచారు. కోట్లాది రూపాయల భారాన్ని జనంపై వేశారు.

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో కొత్త కార్యక్రమాన్ని జూలై నుంచీ అమలు చేస్తోంది. ఇందుకోసం 11 రకాల సమస్యలను గుర్తించారు. వాటిని ఈ కార్యక్రమంలో చేపట్టాలని నిర్ణయించారు. ముందుగా సిఎం జగన్ మంత్రులు, ఎమ్మెల్యేలకు వర్క్‌షాపు నిర్ణయించారు. దీని ఉద్దేశాలను, ప్రజలకు చేయాల్సిన సేవలను వివరించారు. నెల రోజులపాటు జనంలో ఉండే ఎజండాను ఖరారు చేశారు. వాస్తవానికి ఇదొక రాజకీయ ఎజండానే... దీని పేరుతో ప్రభుత్వం నుంచి అందించే సేవలను ప్రచారంలో పెడుతున్నారు. ఇదే దీని ఉద్దేశం. వాస్తవానికి నాలుగేళ్లలో వ్యక్తిగత సమస్యలు ఏమీ పరిష్కారం కాలేదు. సచివాలయాలు వచ్చినా భూ సమస్యలపై దృష్టి పెట్టలేదు. పెట్టినా పరిష్కారం వారి స్థాయిలో లేదు. ఇప్పటికీ స్పందనలో అర్జీలు కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి. కలెక్టర్ ఏదైనా గ్రామానికి వెళ్లి అర్జీలు స్వీకరిస్తే వందల్లోనే వస్తున్నాయి. ఎక్కువశాతం భూములవే.. ఇలాంటి వాటిని పరిష్కారం చేయడానికి ఎజెండా లేదు. అధికారులకు సరైన ఆదేశాలు లేవు. 22ఏ కింద నిషేధం పెట్టిన భూములపై ఇప్పటికీ వేగంగా నిర్ణయం తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయి నుంచీ కలెక్టర్ వరకూ ఈ భూముల వ్యవహారం నడుస్తోంది. పరిష్కారం మాత్రం కావడం లేదు. జనం తిరగలేక అల్లాడుతున్నారు. ఇలాంటివి జగనన్న సురక్షలో కనిపించడం లేదు. జనం అర్జీ తీసుకుని ఏ సమస్య కోసం తిరుగుతున్నారో వాటిపై దృష్టి సారించాలి.

నియోజకవర్గాల్లో రాజకీయవేడి పెరుగుతోంది. ఆర్థిక వ్యవహారాలు మొదలు రాజకీయ ఉనికి కోసం నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది. పలు నియోజకవర్గాల్లో నేతలు ప్రధానంగా పాలకపక్షంలోనే ఈ కుస్తీలు పడుతున్నారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులూ.. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఆర్థిక పరమైన వసూళ్లు కొనసాగుతున్నాయి. వీటిపైనా నేతల మధ్య చర్చలు సాగుతున్నాయి. అధిష్టానానికి ఫిర్యాదులూ వెళుతున్నాయి. గ్రానైట్, గ్రావెల్, ఇసుక, రేషన్‌బియ్యం తదితర రంగాల్లో వసూళ్లు ప్రభుత్వానికే చెడ్డపేరు తెస్తున్నాయి. కోట్లాది రూపాయాలు ఈ రంగాల నుంచి నేతలు వసూళ్లు చేస్తున్నారనేదీ వాస్తవం. ఇక టిక్కెట్ల కోసం ప్రయత్నాలు పెరిగాయి. ఉన్న పార్టీలో టిక్కెట్టు రాకుంటే వేరేపార్టీలోకి దూకే ఆలోచనలు కూడా చేస్తున్నారు. ఈ పరిస్థితులు రాజకీయంగానూ పార్టీల్లో అనిశ్చితికి కారణాలుగా కనిపిస్తున్నాయి. రాజకీయ సమీకరణల్లోనూ మార్పులు దిశగా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

పోలీసుశాఖను అప్రదిష్టపాలు చేసే ఘటన అద్దంకి పరిధిలో జరిగింది. ఇక్కడ పోలీసులు వీధిన పడ్డారు. మహిళలతో అసభ్యంగా మాట్లాడిన వీడియోలు, ఆడియోలు వైరల్‌గా మారాయి. ఆ సంఘటన నుంచి బయటపడేందుకు చేసిన యత్నాలతో మరింత విమర్శలపాలయ్యారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. కేసుల్లో ఎలా ఇరికించవచ్చునేది ఈ సంఘటనలో తేలింది. ఒక మహిళా కానిస్టేబుల్‌తో తెల్లకాగితంపై సంతకం చేయించుకుని దాన్ని అడ్డుపెట్టుకుని ఓ కానిస్టేబుల్‌పై కేసు పెట్టారు. పోలీసులకే ఇలా జరిగితే...సామాన్యుల పరిస్థితి ఏమిటో ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చింది.